తహశీల్దారుపై సస్పెన్షన్ వేటు

కడప కలెక్టరేట్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): విధుల్లో చేరకుండా, ఉద్యోగ నియమ నిబంధనలు ఉల్లంఘించి ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతారు చేసిన తహశీల్దారు యు.దస్తగిరయ్యను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా యు.దస్తగిరయ్యను తిరుపతి జిల్లా నుంచి వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలోని కేఆర్ఆర్సీ తహశీల్దారుగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నిర్దీత గడువులోగా ఆయన వచ్చి చేరలేదు. వెంటనే విధుల్లో చేరాలని ఫోన్ ద్వారా చెప్పడమే కాకుండా కలెక్టర్ మెమో కూడా జారీ చేశారు. అయినా విధుల్లో చేరలేదు. దీంతో తహశీల్దారు దస్తగిరయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సాగునీటి సంఘాల సమరానికి.. నేడు నోటిఫికేషన్

- జిల్లాలో 203 సంఘాలకు 14న ఎన్నికలు

(కడప-ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల సమరానికి వేళయింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. నీటి వనరులను రైతులే అభివృద్ధి చేసేందుకు గాను సాగునీటి సంఘాలకు చంద్రబాబు సర్కార్ ఎన్నికలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో 203 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో 1,59,552 మంది రైతులు ఉన్నారు. వీరంతా ఆ యా సాగునీటి వనరుల పరిధిలోని మెంబర్లను ఎన్నుకోనున్నారు. దీనికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. 14వ తేదీ శనివారం ఎన్నికలు ఉంటాయి. పోటీ చేసే సభ్యులు నామినేషన్ వేయాల్సి ఉంది. మధ్యాహ్నం లోపు పీసీ మెంబర్ల ఎంపిక పూర్తవుతుంది. మధ్యాహ్నం ఆయకట్టు సాగునీటి సంఘం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక ఉంటుంది.

సార్వత్రిక ఎన్నికలయిన ఆరు నెలల తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనుండడంతో టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సాగునీటి సంఘాల అభివృద్ధికి నేరుగా ఆ కమిటీలకు నిధులు వస్తాయి. కాల్వల మరమ్మతులకు ఇతర పనులకు నిధులు నేరుగా సంఘాల ఖాతాల్లోనే జమ కానున్నాయి. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలకు గ్రామస్థాయిలో బాగా పోటీ నెలకొననుంది. ఈ ఎన్నికల్లో చాలా వరకు తమ మద్దతుదారులను గెలిపించుకోవాలని టీడీపీ భావిస్తోంది. జగన్ సొంత జిల్లా కావడంతో వైసీపీ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఈ ఎన్నికలు హోరాహోరీ సాగనున్నాయి.

జమిలి ఎన్నికలు పిచ్చితుగ్లక్ చర్య

వేంపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల నిర్ణయం పిచ్చితుగ్లక్ చర్య అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే 18 రాజ్యాంగ సవరణలు చేయాలన్నారు. రాజ్యాంగ సవరణలు చేయాలంటే పార్లమెంటులో మూడింట రెండువంతుల మెజారిటీ ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అసాధ్యమన్నారు. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 543 అన్నారు. మెజారిటీ రావాలంటే 362 మంది సభ్యుల మద్దతు కావాలన్నారు. ప్రస్తుత ఎన్‌డీఏ కూటమి సభ్యుల సంఖ్య 293 అని 69 మంది తక్కువగా ఉన్నారన్నారు. రాజ్యసభలో కూడా మొత్తం సభ్యుల సంఖ్య 245 కాగా.. కావాల్సింది 164 మంది అయితే ఎన్‌డీఏకు ఉన్నది 121 మంది అని కొరత 43 అన్నారు. కాబట్టి రాజ్యాంగ సవరణ సాధ్యం కాదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అభివృద్ధికి అడ్డువస్తోంది అనడం కూడా సాకు మాత్రమే అన్నారు. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తాయన్నారు. అవినీతి అనకొండలా పెరిగిపోతుందన్నారు. ఇప్పటికైనా జమిలి ఎన్నికల నిర్ణయాన్ని మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రం - జ్యోతిక్షేత్రం

6

- భక్తుల కోర్కెలు తీర్చే అవధూత కాశిరెడ్డి నాయన
- 14, 15 తేదీల్లో 29వ ఆరాధనోత్సవాలు

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అస్వస్థత

7

- ఆస్పత్రికి పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

పల్లె ప్రజల దాహార్తిని తీర్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వేసవి వస్తే చాలు.. గుక్కెడు నీటికోసం వ్యవసాయ బోర్ల వద్దకు బిందెలు తీసుకుని పరుగులు తీసే పల్లెజనాల కష్టాలకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. జల్‌జీవన్ మిషన్ ద్వారా 24/7 గంటలు తాగునీరు అందించాలని సంకల్పించింది. ప్రాజెక్టులు, నదుల నుంచి పైపుల ద్వారా నీరు తీసుకెళ్లి సరఫరా చేయాలని అంచనాకు వచ్చింది. ఈ మేరకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధమవుతోంది. జిల్లాలో ప్రతి పల్లెకు ప్రాజెక్టుల ద్వారా నీరందించేందుకు రూ.1500.13 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే ఇక పల్లెల్లో నీటి సమస్య అనే మాటే వినిపించదు.



పల్లెల్లో దాహార్తికి చెక్..!

- ప్రాజెక్టుల నుంచి పైపులైను ద్వారా..
- 24/7 నీటి సరఫరాకు డీపీఆర్ తయారీ
- రూ.1500.13 కోట్లు ఖర్చవుతుందని అంచనా
- పక్కాగా జల్‌జీవన్ అమలుకు కసరత్తు

(కడప-ఆంధ్రజ్యోతి): విభజిత రాష్ట్రానికి మొదటి సీఎంగా 2014-2019లో పనిచేసిన చంద్రబాబు నాయుడు హయాంలోనే జిల్లాలో వాటర్ గ్రిడ్ ద్వారా దాహార్తి తీర్చేందుకు డీపీఆర్ తయారు చేశారు. ప్రాజెక్టుల నుంచి నీరు తీసుకు వస్తే తాగునీటి సమస్య ఉండదని భావించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటర్‌గ్రిడ్‌ను అటకెక్కించింది. ఇక కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ ద్వారా నేరుగా ఇంటింటికీ నీరందించాలని నిర్ణయించింది. ఆ పథకాన్ని కూడా నాటి వైసీపీ ప్రభుత్వం జిల్లాలో సరిగా వినియోగించుకోలేక పోయింది. కుళాయిలు ఏర్పాటు చేశారు కానీ చాలా చోట్ల నీరు రాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో జల్‌జీవన్ ద్వారా రూ.59.39 కోట్లు ఖర్చు పెట్టి 1105 పనులు చేశారు. అయినప్పటికీ నీటి సమస్య తీర్చలేకపోయారు. ఈ నేపథ్యంలో ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను పక్కాగా అమలు చేసి రూ.1500 కోట్లతో పల్లెల్లో దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 2,86,309 కుటుంబాలున్నాయి. రోజువారి అవసరాల కోసం ఒక్కొక్కరికి 55 లీటర్ల నీటిని అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో 40 లీటర్లు మాత్రమే అందిస్తున్నారు. అన్ని రకాల స్కీంలు కలిపి 2,814 ఉన్నాయి. వేసవి వచ్చిందంటే చాలు తీవ్ర తాగు నీటి ఎద్దడి నెలకొంటోంది. జిల్లాలో పోరుమామిళ్ల, కలసపాడు, బద్వేలు, అట్లూరు, మరికొన్ని ప్రాంతాల్లో వేసవిలో నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ఆ సమయంలో తాత్కాలికంగా వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేవారు. అవి గ్రామీణుల అవసరాలను తీర్చేవి కావు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పొడవునా రోజంతా పల్లెల్లో నీరు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయా ప్రాజెక్టుల పరిధిలోని గ్రామాలకు పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు.

- సర్వరాయసాగర్ ప్రాజెక్టు నుంచి కమలాపురం నియోజకవర్గంలోని వీఎన్‌పల్లె, కమలాపురం, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు, సీకే దిన్నె మండలాల్లోని 327 గ్రామాలకు పైపులైను ద్వారా నీరందించనున్నారు. ఇక్కడ మొత్తం 1,64,283 మంది ఉన్నారు. 0.27 టీఎంసీల నీటిని తీసుకోనున్నారు. ఇందుకు రూ.250 కోట్లు ఖర్చు కానుంది.

- తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో తెలుగుగంగ సబ్సిడీ రిజర్వాయరు-1 నుంచి దువ్వూరు, చాపాడులోని 140 గ్రామాల పరిధిలోని 94,472 మందికి నీరందించ నున్నారు. ఇక్కడ నుంచి 0.160 టీఎంసీలు తీసుకోనున్నారు. దీనికి రూ.145 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. తెలుగుగంగ సబ్సిడీ రిజర్వాయరు-2 నుంచి మైదుకూరు, ఖాజీపేటమండలాల్లోని 137 గ్రామాల్లో ఉన్న 54,023 గ్రామాలకు నీరందించనున్నారు. 0.09 టీఎంసీల నీటిని వినియోగించనున్నారు. ఇందుకు రూ.85 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

- మైలవరం జలాశయం నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరులోని 161 గ్రామాలకు నీరందించనున్నారు. 2,49,083 మంది జనాభా ఉన్నారు. మైలవరం నీటి సామర్థ్యం 9.9 టీఎంసీలు. ఇక్కడ 0.39 టీఎంసీలు తీసుకోవాలని అంచనా వేశారు. ఇందుకు పైపులైనుకు రూ.380 కోట్లు ఖర్చు కానుంది.

- గండికోట జలాశయం నుంచి జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం ముద్దనూరు, ఎర్రగుంట్ల మండలాల్లోని 88 గ్రామాల్లో ఉన్న 82,085 మందికి నీరందించేలా డీపీఆర్ తయారు చేశారు. గండికోట సామర్థ్యం 26.84 టీఎంసీలు. ఇక్కడ నుంచి 0.183 టీఎంసీలను తీసుకోనున్నారు. దీనికి రూ.130 కోట్లు ఖర్చుకానుంది.

- బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 17.73 టీఎంసీలు. ఇక్కడ నుంచి 0.39 టీఎంసీల నీటిని తీసుకుని పైపులైన్ల ద్వారా అట్లూరు, బద్వేలు, గోపవరం, కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు, బి.మఠం మండలాల్లోని 430 గ్రామాలకు నీరు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక్కడ మొత్తం 2,28,601 మంది ఉన్నారు. ఇందుకు రూ.430 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

- పెన్నా రిజర్వాయరు నుంచి ఒంటిమిట్ట మండలంలోని 50 గ్రామాల్లో 17,622 మందికి నీరివ్వాలని నిర్ణయించారు. ఇక్కడ 0.04 టీఎంసీలు తీసుకోనున్నారు. దీనికి రూ.35 కోట్లు ఖర్చు కానుంది. పెన్నా రిజర్వాయరు నుంచి సిద్దవటం మండలంలోని 83 గ్రామాల్లోని 26,083 మంది జనాలకు తాగునీటిని సరఫరా చేయనున్నారు. దీనికోసం. 0.05 టీఎంసీలు తీసుకోనున్నారు. ఇందుకు రూ.45కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులన్నీ అందుబాటులోకి వస్తే జిల్లా ప్రజలకు తాగునీటి సమస్య తీరనుంది.

తాగునీటి ఎద్దడి రాకూడదు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తాగునీటి సమస్యపై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. ముందుగానే శాశ్వత నీటి వనరులను గుర్తించాలన్నారు. రానున్న వేసవిలో జిల్లాలోని చెరువులు, కుంటలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపాలన్నారు. నీటి సరఫరాకు మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేయాలన్నారు. నీటి సంబంధిత పనులు ఉంటే వెంటనే ప్రతిపాదనలు చేయాలన్నారు. ఏవైనా చిన్నచిన్న మరమ్మతులు ఉంటే వాటిని వెంటనే చేసి ప్రజలకు నీటి కొరత లేకుండా ప్రాంతాల వారీగా సరఫరా చేయాలన్నారు. జిల్లాలో నిరంతరంగా నీటిని సరఫరా చేసేందుకు శాశ్వత పనులు చేపట్టాలన్నారు. ప్రజలు నీటి ఇబ్బందులకు గురికాకూడదని అందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ సీఈ శ్రీనివాసులు, ఎస్ఈ వెంకట్రామయ్య, మున్సిపల్ నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు శ్రీనివాసమూర్తి, డీఈ చెన్నకేశవరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ రమణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే

- జగనన్న మెగా లేఅవుట్‌లో ముందుకు సాగని ఇళ్ల నిర్మాణం
- నిర్మాణంలో ఉన్న ఇళ్ల చుట్టూ..
- పిచ్చిమొక్కలు, కంపచెట్లు దర్శనమిస్తున్న వైనం
- ఇదీ మాజీ సీఎం సొంతూరులో పరిస్థితి

వైఎస్ జగన్ సొంతూరు పులివెందుల. ఇక్కడి ప్రజలు వైఎస్ కుటుంబాన్ని దశాబ్దాలుగా ఆదరిస్తున్నారు. వైఎస్సార్ తర్వాత తిరిగి పదేళ్లకు ఆయన కుమారుడు జగన్ సీఎం కావడంతో పులివెందుల ప్రజలు సంబరపడ్డారు. ఇక్కడి పేదలు తమకు పక్కాగృహాలు అందుబాటులోకి వస్తాయని ఆశించారు. వారి ఆశలు కార్యరూపం దాల్చేలా సీఎం హోదాలో జగన్ తాము ఇళ్లు కాదు.. ఊర్లే నిర్మిస్తున్నామని ప్రకటించారు. పులివెందుల పట్టణంలోని పేదలకోసం... ఊరవతల 5కి.మీ దూరంలో జగనన్న మెగా లేఅవుట్ వేసి అందులో ఇళ్ల నిర్మాణాల బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఎన్నికల లోపే సొంతిళ్లు వస్తాయని 7వేలమంది పేదలు ఆశించారు. కానీ వారి ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. నిర్మాణాలు పూర్తికాకనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అసంపూర్తి ఇళ్ల చుట్టూ కంపచెట్లు పెరిగిపోతున్నాయి. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.



పులివెందుల జగనన్న లేఅవుట్‌లో అసంపూర్తి నిర్మాణాలు

పులివెందుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పక్కాగృహాలు లేని పేదలకు వైసీపీ ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మిస్తామని ప్రకటించింది. ఈ మేరకు 2022 చివరిలో లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. ఈ కాలనీకి జగనన్న మెగా లేఅవుట్ అని పేరుపెట్టి 7,079 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. లబ్ధిదారులే నేరుగా ఇళ్ల నిర్మాణం చేపడితే పనులు ఒకే సమయానికి పూర్తికావని భావించి ప్రభుత్వమే ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది. ఈ పనులను రాక్రీట్ అనే సంస్థ దక్కించుకుంది. ఆ సంస్థ నుంచి డీఈసీ ఏజెన్సీకి సగం ఇళ్ల నిర్మాణాలు అప్పగించారు. అలాగే వినాయక ఏజెన్సీ, కొమెర రామచంద్ర ఏజెన్సీలకు కూడా పనులు అప్పగించారు. ఈ సంస్థలన్నీ కలిపి 7,079 ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని వైసీపీ ప్రభుత్వం ఆదేశించింది. కాగా.. ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.1.80లక్షల నిధులు సరిపోవని లబ్ధిదారుల నుంచి కొంత మొత్తాన్ని వసూలు చేసేందుకు పులివెందుల మున్సిపాలిటీ తీర్మానం చేసింది. ఈ మేరకు లబ్ధిదారులు ఒక్కొక్కరి నుంచి రూ.35వేలు వసూలు చేసేందుకు నిర్ణయించింది. దీంతో దాదాపు నాలుగువేల మంది రూ.35వేల చొప్పున డబ్బులు చెల్లించారు. పనులు వేగంగా పూర్తిచేసి ఎన్నికల నాటికే లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని నాటి జగన్ ప్రభుత్వం భావించింది. కానీ పనులు అనుకున్న సమయానికి ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో.. బిల్లులు వస్తాయో రావో అనే భయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టిన సంస్థలు ఎక్కడి పనులు అక్కడ ఆపేసి వెళ్లిపోయాయి.

ఇసుక, కంకర, సిమెంటు తరలించేశారు

ఇళ్ల నిర్మాణం కోసం తెచ్చిన ఇటుకలు, ఇసుక, కంకర, సిమెంటు, కడ్డీలు తదితరాలు ఎవరు పడితే వారు ఎత్తుకెళ్లారు. ఎందుకు వీటిని తీసుకెళ్తున్నారని లబ్ధిదారులు, ప్రజలు ప్రశ్నిస్తే అధికారుల పేర్లు, నాయకుల పేర్లు, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి వాటిని అక్కడ నుంచి తరలించి సొమ్ముచేసుకున్నారు. సిమెంటు, ఇనుప కడ్డీలు పెద్దమొత్తంలో తరలించినట్లు అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. కంకర, ఇటుకలు తరలించేటపుడు కొంత మంది అడ్డుకున్నా అప్పటికి ఆపేసి మరి కొన్ని రోజుల తర్వాత వాటిని కూడా తరలించారు. ఎందుకు తరలిస్తున్నారని లబ్ధిదారులు ప్రశ్నించగా రాక్రీట్ సంస్థ వారు చెప్పారని సమాధానం ఇచ్చారు. వాటిని తరలించే నాటికే ఇక్కడ పనులు పూర్తిస్థాయిలో ఆగిపోయాయి.

200 ఇళ్ల నిర్మాణం పూర్తయినా..

జగనన్న మెగా లేఅవుట్‌లో దాదాపు 200 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇంటి నిర్మాణం పూర్తయినప్పటికి అందులో మరుగుదొడ్లు, కరెంటు ఏర్పాటు చేయలేదు. డ్రైనేజీలు, రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఇళ్ల నిర్మాణం పూర్తయినా వాటిని వినియోగంలోకి తెచ్చుకునేందుకు అవకాశం లేదు. ఒకవేళ డ్రైనేజీ, నీటి సరఫరా, కరెంటు, మరుగుదొడ్లు తదితర పనులు పూర్తిచేసినా అక్కడకు వెళ్లలేమని పలువురు లబ్ధిదారులు తెగేసి చెబుతున్నారు. పులివెందుల నుంచి దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో లేఅవుట్ ఏర్పాటు చేయడమే దీనికి కారణం.

పూర్తిచేస్తారా.. శిథిలమవుతాయా


వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా జగనన్న మెగా లేఅవుట్ పేరుతో చేపట్టిన ఇళ్ల నిర్మాణం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇళ్ల నిర్మాణం పూర్తికావాలంటే ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాల్సిందే. లేదంటే అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం శిథిలావస్థకు చేరుకుంటుందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న ఇళ్ల చుట్టూ కంపచెట్లు, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. హౌసింగ్ అధికారుల్లో సైతం ఈ కాలనీని పూర్తిచేయాలనే ధ్యాస కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు చేపట్టి వదిలేసిన కంపెనీలను తెచ్చి నిర్మాణాలు పూర్తిచేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా.. ఆ మేరకు వీరు చొరవ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రూ.35 వేలు చెల్లించినా..

జగనన్న మెగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం కోసం దాదాపు 4వేల మంది ప్రభుత్వం ఇచ్చే నిధులు కాకుండా సొంతంగా రూ.35వేలు చొప్పున రూ.14 కోట్లు పులివెందుల మున్సిపాలిటీకి చెల్లించారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి తమకు ఇస్తుందని ఆశగా డబ్బులు చెల్లించారు. కానీ ఈ పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు పూర్తి అవుతాయో లేదో కాని రూ.35వేలు మాత్రం పోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. కాగా.. జగనన్న మెగా లేఅవుట్ ఇళ్ల నిర్మాణం ఆగిపోయిన విషయమై హౌసింగ్ డీఈ రమణారెడ్డిని వివరణ అడిగేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్ ద్వారా పలుమార్లు ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు.

గండికోట ప్రాజెక్టుకు పర్యాటక శోభ ఏదీ..!

- టూరిజం దిశగా అభివృద్ధి చెందని వైనం
- కూటమి ప్రభుత్వంలోనైనా.. అభివృద్ధి చెందేనా!



7

ప్రారంభం కానున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు

- రైల్వే ప్రయాణికులు, ఎర్రగుంట్ల వాసులకు ఊరట
- ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందించిన రైల్వే అధికారులు

6



ప్రారంభం కానున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు

● రైల్వే ప్రయాణికులు, ఎర్రగుంట్ల వాసులకు ఊరట
ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందించిన రైల్వే అధికారులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులు, ఎర్రగుంట్ల వాసులు కల ఫలించినట్లైంది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. వృద్ధులు, వికలాంగులు, భారీ లగేజీ ప్రయాణికులు, రాత్రిళ్లు స్త్రీల భయాలకు తెర పడనుంది. ఆంధ్రజ్యోతి కథనాలపై రైల్వే అధికారులు స్పందించిన వివరాల్లోకెళితే...

పెరిగిన రైళ్ల వేగంతో నిబంధనలు అనుసరించి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ నిర్మించడంతో స్టేషన్‌లోపలికి వెళ్లేందుకు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, భారీ లగేజీ, చిన్నారులతో వచ్చే ప్రయాణికుల పరిస్థితి దారుణం. రాత్రి పూట స్త్రీలు రావాలంటేనే భయపడేవారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు, ఉత్తరం వైపున్న పోస్టాఫీసు, దక్షిణం వైపున్న నగర పంచాయతీ కార్యాలయం, కాలేజీలు, బస్టాండు, బ్యాంకులు, అవసరాల కోసం రాకపోకలకు ఒకటిన్నర కిలోమీటర్ దూరం తిరిగి రాలేక రైల్వేస్టేషన్ నుంచే వచ్చే వారు. దీంతో ప్రహరీ ఎక్కి దిగే ప్రయత్నాల్లో ఒకరు మృతి చెందగా, మరికొందరు వికలాంగులుగా మారారు. రెండు ప్లాట్ ఫారాలను కలుపుతూ నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దక్షిణం వైపున ప్రయాణికులు గ్రామంలోకి వెళ్లేందుకు పొడిగించారు. అయితే గతంలో రైల్వేస్టేషన్ ఫుట్‌ఓవర్ పక్కనే వుండడంతో ఉత్తరం వైపు పొడిగించలేదు. రైళ్లు దిగిన ప్రయాణికులు అధికభాగం ఉత్తరం వైపున్న ప్రొద్దుటూరు, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం వెళ్తారు. దీంతో ప్లాట్ ఫారాలపై దిగిన ప్రయాణికులు తప్పక రైల్వే స్టేషన్‌లోకి వెళ్లి తిరిగి బయటికి రావాల్సిన పరిస్థితి. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి, ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రహరీ బయటికి ఉత్తరం వైపు ప్రొద్దుటూరు రోడ్డులోకి వెళ్లేందుకు అనువుగా నిర్మించాలని అనేక సార్లు వినతులు వెళ్లాయి. సంతకాల సేకరణ కూడా చేపట్టి డీఆర్ఎం, జీఎం స్థాయి అధికారుల దృష్టికి ప్రయాణికుల అవస్థలను ఆంధ్రజ్యోతి తీసుకెళ్లింది. డీఆర్ఎం మనీష్ అగర్వాల్ దృష్టికి కూడా తీసుకెళ్లగా ఆయన నేరుగా పరిశీలించి వెంటనే స్పందించారు. బ్రిడ్జి ఆవశ్యకతను గుర్తించి టెండర్లు పిలిచి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేశారు. టెండర్లు పూర్తయి నాలుగు నెలలవుతున్నా డిజైన్ కోసం సికింద్రాబాద్‌లో జాప్యం జరిగిందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. అయితే ఇటీవల ఎర్రగుంట్లకు వచ్చిన డీఆర్ఎం విజయకుమా ర్ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ఆయన కూడా స్పందించారు. పదిరోజుల్లో కచ్చితంగా నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చినట్లు వచ్చే వారంలో పనులు ప్రారంభిస్తున్నట్లు ఐఓడబ్లు అధికారులు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీంతో ప్రయాణికుల, ఎర్రగుంట్ల ప్రజల అవస్థలు తీరనున్నాయి.



ఉత్తరం వైపు పొడిగించాల్సిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

18మంది గంజాయి విక్రేతలు అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ కొండయ్య నాయుడు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు తదితరులు

మదనపల్లె అర్బన్, డిసెంబ రు 10(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణలో భాగంగా మదనపల్లె డివిజన్‌లో పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తూ, వాడుతున్న 18 మంది నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు ప్రకటించారు. మంగళవారం స్థానిక వన్ టౌన్ కార్యాలయంలో మీడియా సమావేశంలో డీఎస్పీ అరెస్టు చూపి రిమాండ్‌కు తరలించారు. గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు పుంగనూరు చెందిన వ్యక్తిగా వివరాలు సేకరించామని, త్వరలోనే అతన్ని అరెస్టు చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. మిగిలిన తొమ్మిదిమందికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. 18మంది గంజాయి విక్రేతల వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, భగత్‌సింగ్ కాలనీ వాసి ఆవుల నరసింహులు, నరసింహులు భార్య ఆవుల రెడ్డెమ్మ, ఆవుల చిన్నయ్య, మదనపల్లె పట్టణం, మాయా బజార్ వా సి రామిశెట్టి హర్ష వర్థన్, త్యాగరాజవీధికి చెందిన కార్తీ క్ పవన్, కోళ్లబైలు పంచాయతీ బాబు కాలనీకి చెందిన గాలిగొట్టి బాల కృష్ణారెడ్డి వన్‌టౌన్ పరిధిలో ఉన్నారు. చంద్రాకాలనీకి చెందిన ఆవుల లక్ష్మయ్య, పుంగనూరు మండలం భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఎరుకుల రమణమ్మ, మదనపల్లె మండలం బసినికొండకు చెందిన జబరు న్నీసా (ఆప), మదనపల్లె రాంనగర్‌కు చెందిన జి. సైఫుల్లా, మాయాబజార్‌కు చెందిన బొమ్మలేరు నరసింహులు టూ టౌన్ స్టేషన్ పరిధిలో ఉన్నారు. ముదివేడు పీఎస్ పరిధికి చెందిన కురబల కోట మండలం, అంగళ్లు పంచాయతీ ఆర్‌అండ్‌బీ కాలనీకి చెందిన గుర్రకొండ మహమ్మద్ రఫీ, అదేకాలనీకి చెందిన ఉల్లిభారతి, అంగళ్లకు చెందిన పఠాన్ ముజీబ్‌ఖాన్, మదనపల్లె పట్టణం, జీఎం నగర్‌కు చెందిన కె. నవీన్‌కుమార్, తంబళ్లపల్లె మండలం, మట్లివారిపల్లెకు చెందిన ప్రశాంత్ కుమార్‌రెడ్డి, కలకడ మండలం, బాలయ్యగారిపల్లెకు చెందిన షేక్ సురజ్ బాషాగా గుర్తించారు. కార్యక్రమంలో మదనపల్లెలోని వివిధ పోలీసు స్టేషన్ సీఐలు రిరిసావలి, రామచంద్ర, కళా వెంకట రమణ, రమేష్, ఎస్ఐలు హరిహరప్రసాద్, రహిముల్లా, దిలీప్ కుమార్, శివకుమార్, బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి గంజాయి అమ్ముతున్న తాగుతున్న నిందులను అదుపులోకి తీసుకున్నారు.

వీరి నుంచి నాలుగన్నర కిలోల గంజాయి, ఒక మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నా రు. దీని విలువ రూ. 1లక్ష 30 వేలు, ఉంటుందన్నారు. ప్రతిభ కనపర్చిన ఎస్ఐలు హరి హరప్రసాద్, రహిముల్లా, దిలీప్‌కుమార్, శివకుమార్, కానిస్టేబుల్స్ పురుషోత్తమ, చంద్రప్ప కు రివార్డుల కోసం ఉన్నతాధికారుల కు సిపార్స్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రం - జ్యోతిక్షేత్రం

భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం అవధూత కాశిరెడ్డి నాయన
14,15 తేదీల్లో 29వ ఆరాధనోత్సవాలు ● ముమ్మర ఏర్పాట్లలో నిర్వాహకులు



కాశినాయన డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటూ వచ్చిన వారికి కడుపు నిండా అన్నం పెట్టిపంపే అవదూత కాశిరెడ్డి నాయన సమాధి నిష్టవహించిన జ్యోతిక్షేత్రం భక్తులకు కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఎత్తైన నల్లమల కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతా వరణంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం గా గుర్తింపు పొందింది. పచ్చని పచ్చిక పరిచినట్లున్న ప్రాంతం పర్యాటకులు, భక్తులను ఆకట్టుకుంటోంది. జ్యోతి క్షేత్రంలోని కాశినాయన పాలరాతి సమాధిని దర్శించుకుంటే తమ కోర్కెలు తీరు తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దేశంలోని వివిధ రాష్ట్రానుంచి పుణ్యక్షేత్రాల పర్యటనకు వచ్చే యాత్రికులు సైతం జ్యోతిక్షేత్రాన్ని దర్శించుకుని వెళుతుంటారు. ఎంతో దివ్యక్షేత్రంగా విరాజిల్లే జ్యోతిక్షేత్రంలో కాశిరెడ్డి నాయన 29వ ఆరాధనోత్సవాలు 14, 15 తేదీల్లో వేడుకగా నిర్వహించనున్నారు. ఆలయ నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వివరాల్లోకెళితే...

కాశిరెడ్డి నాయన నేపథ్యం

నెల్లూరు జిల్లా సీతారామాపురం మండలం బెడుసుపల్లెలో మున్నెల్లి కాశమ్మ, సుబ్బారెడ్డి పుణ్య దంపతుల రెండవ సంతానం కాశినాయన. ఆయన అసలు పేరు మున్నెల్లి కాశిరెడ్డి. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక భావాలు కల్గిన కాశిరెడ్డి నాయన గురువు అతిరాచ గురవయ్య భావాలకు ప్రభావితుడై ఆధ్యాత్మిక చింతనతో కాశి నుంచి కన్యాకుమారి వరకు పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ ముం దుకు సాగాడు. ఇందులో భాగంగా కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో పాడుబడిన అనేక దేవాలయాలను పున ర్నిర్మించి గోశాలలు, అన్నదానాలు ఏర్పాటు చేయించాడు. మండలంలోని నాయనపల్లె, గంగనపల్లె, వరికుంట్ల, ముదిరెడ్డి పల్లె సమీపంలోని లింగమయ్య కొండ తదితర గ్రామాల్లో సంచరిస్తూ ఆధ్యాత్మిక విషయాలను బోధిస్తూ రాత్రివేళ చిన్నపిల్లకు విద్యాబుద్దులు నేర్పుతూ ఈప్రాంతీ యులకు సుపరిచితుడయ్యారు. అనంతరం జ్యోతిక్షేత్రం లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం చేరుకుని పూజాకార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవారు. అంతేకాకుండా గరుడాద్రిలో కఠోర తపస్సు చేశారు. జ్యోతి క్షేత్రంలో అన్నపూర్ణాదేవిని ప్రతిష్ఠించారు. మారుమూల పల్లెలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన కాశిరెడ్డినాయన ఆకలిగొన్న వారికి పిడికెడు అన్నం పెట్టడం, గోమాతలను సంరక్షించడం ఇష్టంగా అలవర్చుకున్నాడు. తన వద్దకు వచ్చిన భక్తులకు కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తూ ముందుకు సాగారు. ఆయన ఆలయాలను పునర్నిర్మించిన ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను కొనసాగిస్తూ వచ్చారు. నేటికీ ఆయన ప్రారంభించిన అన్నదాన కార్యక్రమాలు దేదీప్యమాణంగా వెలుగొందుతున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 100 కాశిరెడ్డినాయన దేవాలయాలున్న ట్లు సమాచారం.

ఎక్కడ కాశిరెడ్డినాయన ఆశ్రమం ఉందంటే అక్కడ నిత్యాన్నదానం ఉన్నట్లేనంటారు భక్తులు వయస్సు పైబడిన కాశినాయన చివరి అంకంలో తనఇష్టదైవమైన జ్యోతిక్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 1995 డిసెంబరు 5వ తేదీన శివైక్యం చెందారు. కాశిరెడ్డినాయన అభీష్టం మేరకు జ్యోతిక్షేత్రంలోనే సమాధి చేశారు. కాశినాయన ఎంతో ఇష్టంగా పెంచుకున్న గోమాత కాశినాయన సమాధి అయిన కొన్నిదినాలకే మృతి చెందింది. అక్కడే గోమాతకు సైతం అక్కడే సమాధి కట్టించారు. ప్రస్తుతం జ్యోతిక్షేత్రంలో కాశినాయన పాలరాతి సమాధిపై 60తెలుగు సంవత్సరాలకు ప్రతీకగా 60 రాతిస్తంభాలతో వివిధ కళారూపాలతో మహాద్భుతంగా కాశినాయన దేవాలయ నిర్మాణం జరుగుతోంది.

జ్యోతిక్షేత్రానికి మార్గం

గుంతకల్లు, కర్నూలు, గుంటూరు తదితర దూర ప్రాంతాల నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు బస్టాండుకు, రైల్వేస్టేషన్‌కు వచ్చిన భక్తులకు ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తారు. కడప జిల్లా మైదుకూరు మీదుగా వచ్చే భక్తులు పోరుమామిళ్లకు వచ్చేదారిలోని అమగంపల్లె నుంచి సావిశెట్టిపల్లె, వరికుంట్ల మీదుగా ఆర్టీసీ బస్సులు ప్రైవేట్ వాహనాల్లో జ్యోతి క్షేత్రానికి చేరుకోవచ్చు. పోరుమామిళ్లకు వచ్చిన భక్తులు ఆర్టీసీ బస్టాండు నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా, ప్రైవేట్ వాహనాల్లో కలసపాడుకు పోయే దారిలోని ఓబుళాపురం నుంచి నర్సాపురం మీదుగా జ్యోతి క్షేత్రానికి చేరుకోవచ్చు.

479 కిలోల బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

సుండుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళకాలనీలో అక్రమంగా తరలిస్తున్న 479 కిలోల బియ్యం మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంపై బియ్యం తరలిస్తున్న జబ్బార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. బియ్యం అక్రమంగా తరలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. వీఆర్వో బసయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులకు సౌదియాలో ఉద్యోగాలు

● ఏపీ ఎస్‌ఎస్‌డీసీ జిల్లా అధికారి నాగార్జున

రాయచోటిటౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అన్నమయ్య జిల్లా అధికారి నాగార్జున పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఓంక్యాప్, అల్ యూసుఫ్, ఎంటర్‌ప్రైజెస్ ద్వారా బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగులకు సౌదీ అరేబియా దేశంలో ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లాలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 35 ఏళ్ల లోపు అభ్యర్థులు ఏడాదిన్నర నర్సింగ్‌లో అనుభవం కలిగిన అభ్యర్థులు సౌదీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సౌదీ అరేబియాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు పురుషులకు భారత కరెన్సీలో సుమారు రూ.78 వేలు, మహిళలకు రూ.89 వేలు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం skillinternational@apsscdc.inకు 18వ తేదీలోగా బయోడేటా పంపించాలన్నారు. వివరాలకు 9988853335, 9712655686, 8790118349, 8790117279 సంప్రదించాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

న్యాయవాదులు సోషల్ ఇంజనీర్లు

- జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి వ్యాఖ్య

రాయచోటి టౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్రం రాకమునుపు గానీ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గానీ సామాజిక మార్పుల్లో న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తూ మెరుగైన సమాజం కోసం సోషల్ ఇంజనీర్లుగా పేరు తెచ్చుకున్నారని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) కడప, అన్నమయ్య జిల్లాల కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ నేతృత్వంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఐఏఎల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహానుభావులు బ్రిటీష్ వారిపై పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించారని, వారంతా న్యాయవాదులేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా అంబేడ్కర్ సహా చాలా మంది న్యాయవాదులు రాజ్యాంగ నిర్మాణ దశలో, రాజ్యాంగం అనుసరించి చేస్తున్న చట్టాల అమలు విషయంలో కానీ న్యాయ మూర్తులు ఉత్తమమైన తీర్పులు చెప్పడంలో గానీ న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తూనే వస్తున్నారని ఆయన కొనియాడారు. సమాజంలో ఎలాంటి సందర్భాల్లో వ్యక్తులు నేరాలకు పాల్పడుతున్నారో అందుకు గల సామాజిక పరిస్థితులను సవివరంగా వివరించి శిక్ష వేయడంలో న్యాయమూర్తులు ఆలోచింపజేసేలా చేసే శక్తి న్యాయవాదులకు మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, ఏపీపీ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ధనుంజయ్‌కుమార్, ఆనంద్‌కుమార్, రామాంజనేయులు, వీరభద్ర య్య, నాగమల్లు, రెడ్డిబాషా, టీపీ రమణ, కిజర్‌అలీ, ఆదిరెడ్డినాయక్, వరలక్ష్మి, ఉత్తేజ్ కుమార్, రవిశంకర్, నిరంజన్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు యశ్వంత్

స్టోరీ టెల్లింగ్ విభాగంలో మోడల్ స్కూల్ విద్యార్థి



అవార్డు అందుకుంటున్న విద్యార్థి

సంబేపల్లె, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): విజయవాడలో కళా ఉత్సవ్ కార్యక్రమా ల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టోరీ టెల్లింగ్ విభాగంలో జరిగిన పోటీల్లో సంబేపల్లె ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి యశ్వంత్‌రెడ్డి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. విజయవాడలో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి నుంచి విద్యార్థి అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి స్టోరీ టెల్లింగ్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. తమ విద్యార్థి ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

'రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి'

మద నపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని, అక్రమంగా రైస్‌మిల్లుల్లో నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన మాట్లాడుతూ జిల్లా అంతటా రైస్‌మిల్లుల్లో పోలీసులు సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించాలన్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అక్రమ రవాణా చేస్తున్నవారిపై పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభులు కృష్ణప్ప, సాంబశివ, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, దేవా, రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాల విభజన గాయం....

● అసంపూర్తిగా పీలేరు ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల భవనాలు
● రూ.26.50 లక్షల పెండింగ్ బిల్లులు ● చెల్లింపు నుంచి తప్పించుకుంటున్న అధికారులు



అసంపూర్తిగా మిగిలిపోయిన నూతన భవనాలు

పీలేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సరళీకృతం అంటూ జిల్లాల పునర్విభజన చేపట్టాలని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తూ ఆగమేఘాలపై జిల్లాలను విభజించింది. రాజకీయ కోణంలో చేపట్టిన పునర్విభజనతో అనేక రకాల సమస్యలు తలెత్తాయి. ఇందులో భౌగోళికంగా కొన్ని సమస్యలుంటే కార్యాలయాల రూపంలో మరికొన్ని సమస్యలు జఠిలమయ్యాయి. అయితే విభజనలో చోటుచేసుకున్న మార్పుల్లో కొన్ని సమస్యలపై సరిహద్దు వివాదాలు మొదలయ్యాయి. ఈ కోవకు చెందినదే పీలేరు ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనాల నిర్మాణాలు. పీలేరు మండలం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్నప్పుడు ప్రారంభమైన ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాలు జిల్లాల విభజన తరువాత పూర్తిగా ఆగిపోయాయి. ఉమ్మడి జిల్లా అధికారులు బిల్లులు చెల్లిస్తారని నూతన జిల్లా అధికారులు, నూతన జిల్లా అధికారులే చెల్లిస్తారని ఉమ్మడి జిల్లా అధికారులు బాధ్యతల నుంచి తప్పించుకుంటూ ఉండడంతో నిర్మాణ బాధ్యతలు చేపట్టిన పాఠశాల కమిటీ సభ్యులు పనులను సగంలోనే నిలిపివేశారు. దీంతో పాత పాఠశాలలోనే ఇరుకు గదుల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాల విభజనతో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించడం మాత్రం మరిచింది. తమ సమస్యలు పరిష్కరించమని బాధితులు ఎన్నిమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోలేదు.

ఉర్దూ విద్యకు పెట్టింది పేరు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉర్దూ విద్యకు పేరెన్నిక గల ప్రాంతాల్లో పీలేరు కూడా ఒకటి. నాలుగు దశాబ్దాలుగా పీలేరులో ఉర్దూ పాఠశాల నడుస్తోంది. పీలేరు పరిసర ప్రాంతాలైన రొంపిచెర్ల, సదుం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పులిచెర్ల కేవీపల్లె మండలాల నుంచి చాలా మంది విద్యార్థులు పీలేరులోని ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదివేవారు. గాంధీ రోడ్డులో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఇరవై ఏళ్ల కిందట ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి వరకు ఏటా సుమారు 300 మంది విద్యార్థులు ఉర్దూ మాధ్యమంలో టెన్త్ ఉత్తీర్ణులై ఇంటర్, డిగ్రీ కోసం అప్పటి ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటికి వెళ్లేవారు. ప్రస్తుతం పీలేరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో 203 మంది విద్యార్థులు చదువుతున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో ఉర్దూ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడే వారు. ఆ ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో 2018లో రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) పథకం కింద ఐదు గదులు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.

రూ.53 లక్షలతో అదనపు గదులు

రూ.53 లక్షల ఆర్ఎంఎస్ఏ నిధులతో ఉర్దూ ఉన్నత పాఠశాల కోసం ఐదు తరగతి గదులు నిర్మించేలా ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కమిటీకి బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం పాత శాల ఉన్న గాంధీ రోడ్డులో తగినంత స్థలం లేకపోవడంతో రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో నిర్మాణాలు ప్రారంభించారు. తొలివిడత పాఠశాల ఖాతాలో రూ.23.50 లక్షల నిధులు కూడా జమయ్యాయి. పనులు జరిగే క్రమంలో పాక్షిక బిల్లుల చెల్లింపు ఉంటుందన్న అధికారుల భరోసాతో కమిటీ సభ్యులు పనులు ప్రారంభించారు. ఆ క్రమంలో 2022 వరకు రూ.23.50 లక్షల బిల్లుల చెల్లింపులు కూడా జరిగాయి. నిధులు వచ్చేస్తాయన్న విశ్వాసంతో కమిటీ సభ్యులు రూ.45 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు. అయితే జిల్లాల విభజనలో పీలేరు మండలం అన్నమయ్య జిల్లాలోకి కలిపేశారు. ప్రభుత్వం. కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ ముగిసి పాలన గాడిలో పడిన తరువాత బిల్లుల చెల్లిస్తారని ఎదురుచూశారు. అయితే బాధ్యతలు చేపట్టిన కొత్త జిల్లా అధికారులు పాత పనుల గురించి తమకేమీ తెలియదని తేల్చి చెప్పేశారు.

బిల్లుల కోసం పరుగులు

బిల్లులు వస్తాయన్న నమ్మకం సన్నగిల్లడంతో ఉర్దూ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అటు చిత్తూరుకు, ఇటు రాయచోటికి పరుగులు పెట్టారు. 'మీ ఊరు కొత్త జిల్లాకు వెళ్లింది గనుక కొత్త జిల్లా వారే బిల్లులు చెల్లిస్తారు' అంటూ చిత్తూరు జిల్లా అధికారులు, 'పాత జిల్లా ఉన్నప్పుడు పనులు జరిగాయి కాబట్టి పాత జిల్లా వారే బిల్లులు చెల్లిస్తారు' అంటూ అన్నమయ్య జిల్లా అధికారులు సెలవివ్వడంతో కమిటీ సభ్యులు ఏం చేయాలో పాలుపోక నిర్మాణ పనులు నిలిపివేశారు. గత ప్రభుత్వం కంటే మరిన్ని ఎక్కువ నిధులు మంజూరు చేయిస్తామంటూ అప్పటి ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు చెప్పిన మాటలు విని ఎక్కువ మొత్తంలో పనులు పూర్తి చేశారు. వారికి రావాల్సిన రూ.23.50 లక్షలకు అదనంగా మరో రూ.15 లక్షల దాకా రావాల్సి ఉందని కమిటీ సభ్యులు వాపోతున్నారు. బిల్లుల సంగతి తేల్చమని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని, జరిగిన నష్టం చాలని, ఇక తాము పనులు చేయలేమని వారు చేతు లెత్తేశారు. గత నెల 30వ తేదీన పీలేరుకు వచ్చిన డీఈఓ సుబ్రహ్మణ్యం దృష్టికి పాత శాల సమస్యను కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వారికి భరోసా కల్పించారు. తమ ఆశలన్నీ ఆయన మీదే ఉన్నాయని, తమ పాఠశాలకు రావాల్సిన బిల్లులు చెల్లిస్తే ఎలాగోలా పనులు పూర్తి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రస్తుతం నడుస్తున్న భవనంలో కేవలం మూడు గదులు మాత్రమే తరగతి గదులు నిర్వహించేందుకు అనువుగా ఉంది. కూటమి ప్రభుత్వమైనా తమ పాఠశాలను పట్టించుకోవాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

హోటల్‌లో చోరీ


సంబేపల్లె, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై మోటకట్ల శివాలయం పక్కన ఉన్న స్టార్ హోటల్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు హోటల్ యజమాని ముక్తా నాగేశ్వర తెలిపారు. బాధితుడి వివరాల మేరకు... సోమవారం రాత్రి హోటల్‌లో పని ముగించుకుని తాళాలు వేసి పక్కనే ఉన్న ఇంట్లో పడుకున్నారు. మంగళవారం ఉదయం హోటల్ తెరవడానికి వచ్చేసమయానికే వాకిలి తెరుచుకుని ఉంది. దుండగులు బ్లేడుతో చిలుకును కోసి వెనుక వైపు వాకిలి తెరిచి చోరీకి పాల్పడ్డారు. రూ.45 వేలు నగదు, గ్యాస్ సిలిండర్, మిక్సీ, వంట పాత్రలు, బియ్యం, సరుకులు తీసుకెళ్లినట్లు వాపోయారు. మొత్తం లక్ష రూపాయలకు పైన నష్టం జరిగినట్లు తెలిపారు. సంబేపల్లె పోలీసులకు చోరీపై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఒక ఇంటి వద్ద ఉన్న వాషింగ్ మిషన్ రెండు రోజుల కిందట చోరీకి గురైంది. వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

యువతిని కాపాడిన పోలీసులు

ఒంటిమిట్ట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న యువతిని పోలీసులు కాపాడారు. సుండుపల్లె మండలం సాకినే బండకు చెందిన ఓ యువతి మంగళవారం సాయంత్రం రైలుపట్టాలపై అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు ఎస్ఐ శివప్రసాద్‌కు సమాచారం తెలిపారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది యువతిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రేమ వ్యవహారంలో మనస్థాపంతో ఆత్మహత్యకు యత్నిసున్నట్లు తెలపడంతో కౌన్సెలింగ్ నిర్వహించారు. కడపలోని ఓ ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ చదువుతున్నానని చెప్పడంతో సిబ్బందితో కలిపి కళాశాలకు పంపామన్నారు. యువతి మానసిక స్థితి కూడా అనుమానాస్పదంగా ఉందన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు నాటు సారా స్వాధీనం

- నలుగురి అరెస్టు




నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ములకలచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ పరిధి ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల్లో ఎక్సైజ్ పోలీసులు, స్క్వాడ్ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లు, నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వేపూరికోటలో వేర్వేరు చోట దాడులు నిర్వహించి 81 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అంజనప్ప, శివయ్యను అరెస్టు చేశారు తంబళ్లపల్లె మండలం కోటకొండలో 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అప్పనాయక్‌ను అరెస్టు చేశారు. రెడ్డికోటలో దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఈశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. సీఐ మాధవి కడప ఎన్‌ఫోర్స్‌మెంట్, రాయచోటి డీటీఎఫ్ సీఐలు పాల్గొన్నారు.

చుట్టూ ఎత్తైన కొండలు.. కనుచూపు మేర సముద్రాన్ని తలపించేలా బ్యాక్‌వాటర్.. సొరంగ మార్గం ద్వారా వరదలా వచ్చి చేరే కృష్ణా జలాలు చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. పెన్నా, చిత్రావతి నదుల సంగమం.. రెండు కొండల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో నిర్మితమైన గండికోట ప్రాజెక్టు దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్టుపై గత వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూడటంతో పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా.. అభివృద్ధికి బాటలు వేయాలని పర్యాటకులు కోరుతున్నారు.



గండికోట ప్రాజెక్టు ముఖద్వారం


రెండు కొండల మధ్య కనువిందు చేస్తున్న గండికోటప్రాజెక్టు

గండికోట ప్రాజెక్టుకు పర్యాటక శోభ ఏదీ..!

- టూరిజం దిశగా అభివృద్ధి చెందని వైనం
- కూటమి ప్రభుత్వంలోనైనా.. అభివృద్ధి చెందేనా!

కొండాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు గండికోట ప్రాజెక్టు గుండెకాయలాంటిది. ప్రస్తుతం పూర్తి నీటి సామర్థ్యంతో నిండుకుండలా ఉంది. 26.85 టీఎం సీల సామర్థ్యంతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు కరువు బారిన పడకుండా జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటోంది. కృష్ణా జలాలతో


చూపరులను ఆకట్టుకునే గండికోట వెనుకజలాలు

కల కలలాడుతూ దర్శనమిస్తున్న గండికోట జలాశ యాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన గత వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు.

గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్ ద్వారా కృష్ణాజలాలు చేరుతాయి. ప్రాజెక్టులోకి నీళ్లు చేరేందుకు కొండలు అడ్డం ఉండటంతో సొరంగాన్ని నిర్మించారు. మైలవరం మండలం లింగాపురం నుంచి గండి కోట ప్రాజెక్టు వరకు 5.5 కిలోమీటర్లు సొరంగాన్ని నిర్మించారు. ఈ సొరంగ మార్గం ద్వారా కృష్ణాజలాలు గండికోటలోకి చేరుతాయి. ఈ దృశ్యం పర్యా టకులను ఆకట్టుకుంటోంది. కాగా, ప్రాజెక్టు కింద 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ముంపు ప్రాంతంలో బ్యాక్‌వాటర్‌తో కృష్ణా జలాలు కనువిందు చేస్తున్నాయి.

బోటింగ్ ఏర్పాటు చేస్తే ...

గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే బోటింగ్ ఏర్పాటు తప్పనిసరి. ఇప్పటికే మైలవరం జలాశయంలో బోటింగ్ ఏర్పాటు చేసినా, దానికంటే పెద్దదైన గండికోట ప్రాజెక్టులో ఇంత వరకు బోటింగ్ కూడా ఏర్పాటు చేయ కపోవడం గమనార్హం. సర్ ఆర్థర్ కాటన్ మనవడు రాబర్ట్ కాటన్‌తో పాటు పలువురు గండికోట ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు ప్రాంతంలో అందాలను చూచి మైమరచిపోయారు.

కూటమి ప్రభుత్వంలో... అభివృద్ధి చెందేనా

గండికోట ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గండికోట ప్రాజెక్టు ప్రాం తంలో రిసార్ట్‌లు, వెనుక జలాల్లో బోటింగ్ సౌక ర్యం, వ్యూపాయింట్లు వంటి వాటిని ఏర్పాటు చేసే ందుకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అవ కాశాలు పుష్కలంగా ఉన్నాయి.


గండికోట ప్రాజెక్టు నుంచి వివిధ ప్రాజెక్టులకు నీరు వెళ్లే మెయిన్‌కెనాల్


గండికోట ప్రాజెక్టును సందర్శించిన సర్ ఆర్థర్ కాటన్ మనవడు రాబర్ట్‌కాటన్ తదితరులు (ఫైల్‌ఫోటో)

త్రుటిలో తప్పిన ప్రమాదం

- లారీని ఢీ కొట్టిన మరో లారీ
- భారీగా స్తంభించిన ట్రాఫిక్


ప్రమాదానికి గురైన లారీలు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ఉన్న గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ సంఘట నలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదానికి గురైన లారీలు రోడ్డు మధ్య ఉండడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసు కున్న రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ జయరాములు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నంద్యాల నుంచి కోడూరుకు లోడ్‌తో వెళుతున్న లారీని.. రాజంపేట నుంచి కడప వైపుగా వస్తున్న మరో లారీ కడప సెంట్రల్ జైలు వద్దకు రాగానే గుంతను తప్పించబోయి ఢీ కొంది. ప్రమాదంలో ఇరు వురు లారీ డ్రైవర్లకు ఎలాంటి గాయాలు తగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

కుందూ నదిలో పడి యువకుడి మృతి



చాపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చాపాడు గ్రామానికి చెందిన పూజారి మహేష్‌బాబు (32) అనే యువకుడు కుందూనదిలో పడి మృతి చెందా డు. సురేష్‌బాబు ఈనెల 9న సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో కాలకృత్యాల కోసం గ్రామం ఆనుకుని ఉన్న కుందూ నది వద్దకు వెళ్లి నీటిలో కారుజారి పడిపోయాడు. అప్పటికే చీకటి పడడంతో ఎవరు ఈ ప్రమాదాన్ని గమనించలేదు. మంగళవారం ఉదయం అతని అన్న లక్షుమయ్య తమ్ముడి ఆచూకీ కోసం నది వద్దకు వెళ్లి చూడగా చాకలి రేవు వద్ద మృతదేహం ఉన్న విషయాన్ని గుర్తించారు. సురేష్‌బాబుకు మానసిక పరిస్థితి కూడా బాగలేదు. ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. లక్షుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



రాయచోటి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండ గా ద్విచక్ర వాహనం ఢీకొన డంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు రాయచోటి పట్టణంలోని మాసా పేటకు చెందిన కత్తి అంకయ్య (76) పట్టణ పరిధి లోని మదనపల్లి రోడ్డులో శ్రీనివాసపురం క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అంక య్యను స్థానికులు రాయచోటి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ



ముద్దనూరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయబోర్లకు సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీకి గురైె నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ తెలిపారు. సోమవారం చింతకుంట గ్రామానికి చెందిన చంద్రమోహన్, కమ్మవారిపల్లెకు చెందినసంజీవగాళ్ల వీరమ్మకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగలగొట్టి.. అందులోని కాపర్ వైరు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

తాగునీటి మోటర్లలో వైర్లు..

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత తాగునీటి మోటర్లకు సంబంధించిన వైర్లను దొంగలు చోరీ చేశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5గంటలకే తాగునీటిని ప్రజలకు అందించేవారు. అయితే మంగళవారం ఉదయం పంచాయతీ సిబ్బంది మోటర్ల వద్దకు వెళ్లగా కేసీ కెనాల్ కట్టపై, మద్దిమాను వద్ద ఉన్న తాగునీటి మోటార్ల వైర్లు కోసుకెళ్లినట్లు గమనించారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : అదనపు ఎస్పీ

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బంది కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందని అదనపు ఎస్పీ (పరిపాలన) ప్రకాష్‌బాబు అన్నారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా ప్రమాదానికి గురై కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ నాగార్జునరెడ్డి మృతి చెందాడు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నాగార్జునరెడ్డి సతీమణి బి.లక్ష్మీకాంతమ్మకు ఏఎస్పీ రూ.2.5 లక్షల చెక్‌ను ఆర్థిక సాయం కింద అందజేశారు. అనంతరం ఏఎస్ఐ కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని.. పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీపీవో ఏఓ జ్యోతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్ఐ భార్యకు చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు ఒకరి పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడిన యువకుడు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఐటిఐ సర్కిల్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు ఫాతిమా కాలేజ్ సమీపంలోని ఫంక్షన్‌కు పల్సర్ బైకుపై వెళుతున్నారు. ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్దకు రాగానే పార్కింగ్ చేసిన వాహనాన్ని వేగంగా వచ్చిన బైకు ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైకు నడిపిన యువకుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇరువురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలానికి తాలుకా పోలీసులు చేరుకొని ప్రమాద ఘటనను పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైకును ఢీకొన్న కారు.. వ్యక్తికి గాయాలు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద బైకును కారు ఢీకొనడంతో బైకులో వెళుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. జమ్మలమడుగు నియోజకవర్గంలోని దొమ్మరనంద్యాలకు చెందిన వినయ్ కుమార్ బైకులో సొంత పని నిమిత్తం కడపకు వచ్చారు. రిమ్స్ ఆసుపత్రి సమీపంలోని రింగ్ రోడ్డుపై వెళుతుండగా కారు వచ్చి ఢీకొనడంతో వినయ్‌కుమార్ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

యువకుడిపై దాడి - కేసు నమోదు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ కాలనీలో మంగళవారం ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆర్టీసీ కాలనీకి చెందిన దామోదర్ రమణల మధ్య మాటమాట పెరిగి ఘర్షణ పడ్డారు. దామోదర్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రమణపై కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలు తెలపవచ్చు

- సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన వన్ మ్యాన్ కమిటీకి అభిప్రాయాలను తెలపవచ్చని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 1న భారత అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలు కులాల్లోని ఉప వర్గీకరణ కోసం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో వన్‌మ్యాన్ కమిటీని నియమించిందని తెలిపారు. సంబంధిత ఏకసభ్య కమిషన్ కార్యాలయం గిరిజన ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు కోనేరు లక్ష్మయ్యవీధి, మొగ్గలరాజపురం, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ విషయంపై ఏదైనా సంతకంతో కూడిన రాతపూర్వక మెమొరాండం, రెప్రజెంటేషన్లు కార్యాలయం పనివేళల్లో జనవరి 9 వరకు స్వయంగా కానీ, రిజిస్టరు పోస్టు ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. అంతేకాకుండా ఈ మెయిల్ ఐడీ ఓఎం ఎస్‌సీ సబ్ క్లాసిఫికేషన్ డాట్ కామ్ ద్వారా కూడా తెలపవచ్చని ఆమె తెలిపారు.

మానవహక్కులకు భంగం కలిగితే సహించే ప్రసక్తే లేదు

- ఎస్ఎస్‌జేఐసీ హెచ్ఆర్‌సీ నేషనల్ చైర్మన్

కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడైనా మానవహక్కులకు భంగం కలిగితే సహించే ప్రసక్తే లేదని షా సోషియల్ జస్టిస్ ఫర్ ఇంటర్‌నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ షా మహ్మద్ స్పష్టం చేశారు. ప్రజల మాన ప్రాణాలతో చెలగాటమాడితే వారి హక్కుల పరిరక్షణ కోసం తాము అక్కడ వుంటామన్నారు. 76వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆ కౌన్సిల్ ఏపీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సుంకేసుల బాదుల్లా అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలందరికీ సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు కలదన్నారు. అలాంటి హక్కును కొంతమంది పనిగట్టుకుని హరించాలని చూడడం సరైంది కాదన్నారు. అనంతరం కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన అలీషేర్‌ను నియమించారు. కార్యక్రమంలో జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్, ప్రజాసంఘాల నాయకులు నజీర్‌అహ్మద్, మన్సూర్ అలీఖాన్, తాహిరుల్లా ఖాద్రి, పి.పెద్దన్న, న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు పాల్గొన్నారు.

కారుణ్య నియామక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కడప రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాలకు సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు మొత్తం నలుగురు అభ్యర్థులు హాజరయ్యారు. జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల పోస్టులు ఖాళీగా లేకపోవడంతో వీరికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను రోస్టర్ పాయింట్ల ప్రకారం త్వరలో కేటాయిస్తామని జడ్పీ సీఈవో తెలిపారు. ఉద్యోగం చేస్తున్న కుటుంబ పెద్ద మరణించడంతో అర్హులైన కుటుంబంలో ఒకరికి వీలైనంత త్వరగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనలో పరిపాలనాధికారి(ఏవో) భాస్కర్‌రెడ్డి, స్టెనో శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అస్వస్థత

- ఆస్పత్రికి పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

వేంపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థుల్లో కొందరు గత నాలుగైదు రోజులుగా విరేచనాలు, కడుపునొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ట్రిపుల్‌ఐటీలోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. రోజుకు 40 నుంచి 50 మంది ఆస్పత్రికి వస్తున్నట్లు తెలిసింది. ట్రిపుల్‌ఐటీలోని పాత క్యాంపస్‌లో చదువుతున్న ఒంగోలు విద్యార్థులకు ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. బయటి నుంచి ఆహారం తెప్పించుకోవడం వల్ల గానీ, మెస్‌లో భోజనం సక్రమంగా లేకపోవడమో, నీళ్లలో కోతులు తిరగడమో కారణమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మానవహక్కులు భవిష్యత్‌కు మార్గదర్శకాలు

- డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మానవహక్కులు భవిష్యత్‌కు మార్గదర్శకాలు అని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానవ హక్కులు అనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను నిర్దేశించినవన్నారు. జాతి, లింగ, వర్ణ, కుల, మత రాజకీయ ఏ విధమైన వివక్షకు గురికాకుండా ఉండే హక్కు అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ అమలు చేస్తున్న పథకాలను, ఉచిత న్యాయ సహాయాన్ని, లీగల్ సర్వీసెస్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పి.హరిబాబు, ఎం.శాంత, పి. మనోహర్, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిత్యకళ్యాణదేవతా మూర్తులు శ్రీమహాలక్ష్మి మోక్ష నారాయణస్వామి శ్రీవల్లి దేవసేన సమేత ద్వికంధర షణ్ముఖ సుబ్రమణ్యేశ్వర స్వామి వెలసిన రామాపురం పుణ్యక్షేత్రంలో బుధవారం మార్గశిర శుక్ల ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏకాదశి నాడు ఉత్తర ద్వార ప్రవేశం చేసి మహావిష్ణువును మహాలక్ష్మిని దర్శించడం వల్ల జీవితంలో ఆనందం శ్రేయస్సు చేకూరుతాయని పురాణాలు పేర్కొంటున్నాయి.

పంట నమోదు తనిఖీ

వేముల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొందిపల్లె, గొల్లలగూడూరు గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదును జిల్లా వనరుల కేంద్రం, కడప డీడీఏ వెంకటరమణారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఏఓ చెన్నారెడ్డి, డీఆర్సీ ఏఓ నాగభూషణ్‌రెడ్డితో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ పంటలో పంట నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

రాష్ట్రస్థాయికి విద్యార్థిని ఎంపిక

వేంపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థిని పి.హిమశ్రీస్నిగ్ధ భగవద్గీత పఠన పోటీలలో ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. జోనల్ స్థాయిలో గ్రేడ్ సి విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్ అభినందించారు

డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే


అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం పాతబస్టాండు సమీపంలో జరుగుతున్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం పాత బస్టాండు సమీపంలో జరుగుతున్న డ్రైనేజీ పనులను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పాతబస్టాండు ప్రాంతంలో చిన్నపాటి వర్షం పడినా ఆ ప్రాంతమంతా జలమయం అవుతుందని, దీంతో ప్రజలు చాలా అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించానన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేయాలని కమిషనరు మనోజ్‌రెడ్డి, ఆర్టీసీ డిపో యాజమాన్యానికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, ఆర్టీసీ కడప డిపో అధికారులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని జేసీకి రైతుల వినతి

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో పంటలు దెబ్బతిని నష్టపోయామని, ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదినేని రామసుబ్బయ్య బీజేఎం రాష్ట్ర నాయకులు లేవాకు రామ్మోహన్‌రెడ్డి, జాయింట్ కలెక్టరు అదితి సింగ్‌కు వినతిపత్రం అందించారు. వరి పాలు పోసుకునే సమయంలో కురిసిన వర్షంతో దిగుబడి తగ్గడంతో పాటు గింజ నల్లబడిందన్నారు. నల్లబడ్డ ధాన్యాన్ని వ్యాపారస్తులు ధర తగ్గించి అడుగుతున్నారని, దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. కావున రైతులకు నష్టపరిహారంతో పాటు నల్లబడ్డ ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జేసీని కోరినట్లు వారు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు గాడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి: ఆర్‌ఎస్‌యూ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర కన్వీనరు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో వారు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి రాగానే ఐదు నెలలకే ప్రజలపై విద్యుత్‌భారం మోపడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణం పెంచిన చార్జీలను తగ్గించాలని, లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నరేంద్ర, గోపి, అయ్యన్న, భాస్కర్, కేశవ, నరసింహారావు, చరణ్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు


విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు... ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కడప కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా జరిగాయి. రాయలసీమ నలుమూలల నుంచి మహిళా భక్తులు హాజరై ఆ తల్లి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వెలిగించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకూ రాహుకాల పూజలు జరిగాయి. పౌర్ణమి రోజున చండీహోమం, అష్టోత్తర శత దీపాలంకార సేవ నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● కడప ఆర్డీఓ జాన్ ఎర్విన్

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తోందని కడప ఆర్డీఓ జాన్ ఎర్విన్ అన్నారు. మంగళవారం మండలంలోని దౌలతాపురం రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు మరియమ్మ తమ భూమికి సంబంధించిన 1బీలో ఫోటో మార్పు ఉందని, దాన్ని సరిచేయాలని కోరగా ఆర్డీఓ అప్పటికప్పుడే ఫోటో మార్పు చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 1బీ అడంగల్‌లో సమస్యలున్నా భూ కొలతల్లో తేడాలున్నా, హద్దుల విషయంలో ఇబ్బందులు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు ఈ సదస్సులు వేదిక అయ్యాయన్నారు. గతంలో ఈ సమస్యల పరిష్కారానికి జిల్లా స్పందనలో అర్జీలు ఇచ్చేవారని, వాటి కోసం రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. అయితే ఇప్పుడు ప్రతి సమస్యను 40 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, సర్వే డీటీ అర్చన, ఆర్ఐ కౌశిక్, వీఆర్ఐ వినోద్, పలువురురైతులు పాల్గొన్నారు.

కలెక్టరుగారూ... బియ్యం అక్రమ రవాణాను ఆపండి

● టీడీపీ నాయకుడు గోవర్ధనరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న గోవర్ధనరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'కలెక్టరు గారూ.. ఉచిత బియ్యం అక్రమ రవాణాను ఆపండి' అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి కోరారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఉచిత బియ్యం మాఫియా దోచుకుంటోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న అధికారులే ఇప్పుడు కూడా మాఫియాకు సహకరిస్తున్నారని ఆరోపించారు. డీలర్లు నిరుపేదల నుంచి అతి తక్కువ ధరతో కొనుగోలు చేయగా వారి నుంచి మాఫియా మరికొంత ఇచ్చి కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. జిల్లాలో లక్షల టన్నుల రేషన్ బియ్యం తరలిపోతోందన్నారు. మాఫియాపై పీడీ యాక్టు ప్రయోగించాలని డిమాండ్ చేశారు.

'అవగాహనలేని కార్పొరేటర్లకు ప్రజలే బుద్ధి చెబుతారు'

కడప మారుతీనగర్, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి) : 'అవగాహనలేని కార్పొరేటర్లకు ప్రజలే బుద్ధి చెబుతారు' అని పాలకొండ దేవస్థానం చైర్మన్ బుర్రి రెడ్డయ్యయాదవ్ పేర్కొన్నారు. ఇప్పటికీ నగర ప్రకాష్‌నగర్, ఎన్జీఆర్ నగర్, శివానందపురం, పుట్లంపల్లి, చెర్లోపల్లి తదితర ప్రాంతాలలో తాగునీరు ఎప్పుడొస్తుందో తెలియని దుస్థితి దాపురించిందన్నారు. మంగళవారం కడపలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ 5 సంవత్సరాల పాలనలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అహంకారధోరణితో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఇబ్బందులకు గురిచేసిన పాపానికి ఖర్మ వెంటాడి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారన్నారు.

ఊరి మధ్యలో మురుగు కాలువ.. కంపు కంపు

● నిత్యం దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న బలిజపల్లె సుగాలితాండ ప్రజలు
● ప్రత్యామ్నాయం ఉన్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కాలువలో నిల్చిన వ్యర్థాలు

సికెదిన్నె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఊరి మధ్యలో మురుగు కాలువ ఉంటే ఎంత దుర్వాసన వస్తుందో చెప్పాల్సిన అవసరం లేదు. ఇంటిలోని మురుగునే భరించాలంటే ఎంతో కష్టం. అలాంటిది ఊరి మధ్యలో మరో గ్రామంలో నుంచి వచ్చే నీరు ప్రవహిస్తూ గ్రామస్థులందరినీ ఇబ్బందులకు గురిచేస్తోంది. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గిరిజన గ్రామం కాబట్టే పాలకులు, అధికారులు తమపై చిన్నచూపు చూస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే... కడప నగరం కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌కు చెందిన బలిజపల్లి సుగాలితాండ ప్రజలు మురుగు కంపుతో విలవిల్లాడుతున్నారు. సుగాలితాండ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికి వారి సమస్యలు ఏళ్ల తరబడి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా సమస్య మాత్రం తీరలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కంపు భరించలేక పలుమార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఎన్నికల సమయంలో మాత్రం తాము నాయకులకు గుర్తుకొస్తామని, పదవులు వచ్చిన వెంటనే మా బాగోగులు మర్చిపోతున్నారని తెలిపారు. మురుగునీరు నిలువ ఉండటంతో దోమలు ఎక్కువై ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామంలో మురుగు కాలువను తొలగించి తమ పిల్లలకు భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా చేయాలని వారు కోరుతున్నారు.


బలిజపల్లె సుగాలితాండా గ్రామం మధ్యలో నుంచి పోతున్న మురుగు కాలువ

అధికారులు స్పందించడం లేదు



అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయలేదు.ఇందిరానగర్‌లోని మురుగంతా మా గ్రామం మధ్యలో నుంచి పారుతోంది. దోమలు, ఎక్కువగా ఉండడంతోపాటు దుర్వాసన భరించలేక ఇబ్బందులకు గురవుతున్నాం. - నాగభూషణం నాయక్, బీఎస్‌తాండా

కంపు భరించలేకున్నాం



మురుగు పోయేందుకు కాలువలు లేకున్నా పక్క గ్రామం మురుగంతా మా ఊరిలోకే వస్తోంది. దీంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కంపు తొలగించి మా సమస్య తీర్చాలి. - నాగమ్మ, బీఎస్ తాండా

చర్మరోగాలు వస్తున్నాయి



మురుగునీరు గ్రామంలో పారుతూ కాలువకు అడ్డం పడినప్పుడు ఒకచోట మురుగు పేరుకుపోయి ఆ నీరు భూమిలోకి ఇంకడంతో తాగునీరు కలుషితమై జనం చర్మ వ్యాధులతో ఇబ్బందిపడుతున్నారు. ఆస్పత్రులకు ఖర్చు చేయాల్సి వస్తోంది. - భారతి, బీఎస్ తాండా

నేడు మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వల్లూరు మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ మల్లీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి హాజరవుతారన్నారు. కావున మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బాల్యవివాహాల పట్ల అవగాహన

వల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంగాయపల్లె జడ్పీహైస్కూలులో బుధవారం సోషల్ వర్కర్ విజయకుమారి ఆధ్వర్యంలో బాల్యవివాహాల పట్ల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు చేస్తే కలిగే దుష్పరిణామల గురించి వారు తెలిపారు. బాలికలు చదువుకుంటేనే అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. పిల్లలకు కిశోర వికాసం గురించి తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే చైల్డ్‌లైన్ నెంబరు1098కు ఫోను చేయాలని సూచించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి, పోలీసు అనురాధ, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఓ 145ను వెంటనే ఉపసంహరించుకోవాలి

● బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు


రిలేదీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

కడప రూరల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలన్న జీఓ నెంబర్ 145ను వెంటనే ఉపసంహరించుకోవాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు డిమాండ్ చేశారు. ఈగిల్(ఫాస్ట్ ట్రాక్ కోర్టు)ను తిపరతిలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట రిలేదీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా గుర్రప్పనాయుడు మాట్లాడుతూ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును తిరుపతికి తరలించడంతో కక్షిదారులు ఎంతో వ్యయప్రయాసాలు పడాల్సి వస్తుందన్నారు. తరలించే పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చారించారు. బార్ అసోసియేషన్ ట్రెజరర్ సుబ్బరామయ్య, మాజీ ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, మాజీ సంయుక్త కార్యదర్శి బాలసుబ్బయ్య, మైసూరారెడ్డి తదితరులు దీక్షలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలిక సజీవ దహనంపై న్యాయ విచారణ జరపాలి: కాంగ్రెస్

కడప కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) నంద్యాల జిల్లా నంది కొట్కూరులో లహరి అనే బాలికను రాఘవేంద్ర అనే వ్యక్తి పెట్రోల్ పోసి సజీవ దహనం చేయడం పాశవిక చర్య అని, ఈ ఘనటనపై ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించాలనీ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నంద్యాల జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి మహమ్మద్ అలీఖాన్, నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు పెరిగాయన్నారు. వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనితకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్న వ్యవహారం చూస్తే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దిగ జారిందన డానికి నిదర్శనమన్నారు. న్యాయ విచారణ చేపట్టాలని మృతి చెందిన లహరి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు శ్యామలమ్మ, సంజ కాంత్, హమీద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే రెవెన్యూ సదస్సులు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవిరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను మభ్యపెట్టేందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు, పేరెంట్స్ టీచర్స్ మెగా సమావేశాలు నిర్వహిస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి ఆరోపించారు. మంగళవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హామీలు మరచి ప్రజలను దగా చేస్తున్నారన్నారు. రెవెన్యూలో లోపాలను జగన్ సరిదిద్దాడన్నారు. భూ రీసర్వే చేసి హక్కుదారులకు దక్కేలా చేశారన్నారు. చుక్కల భూమికి సైతం పరిష్కారం చూపించారన్నారు. అభివృద్ధిపై పులివెందులలో అయినా చర్చకు సిద్ధమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెప్పారని, అభివృద్ధి ఆమె పర్యటించిన ప్రాంతాల్లోనే కనబడుతుందన్నారు. రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని. లేదంటే దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, షఫి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటిరెడ్డి, కోటిరెడ్డి రామసుబ్బమ్మల విగ్రహావిష్కరణ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ఉదయం 9 గంటలకు కళాశాల ఆవరణంలో కోటిరెడ్డి, శ్రీమతి కోటిరెడ్డి రామసుబ్బమ్మల విగ్రహావిష్కరణ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా తెలిపారు. మంగళవారం కడప నగరం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1973లో కళాశాల స్థాపించారు. 2023 నాటికి కళాశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2024 డిసెంబరు 14న స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ స్వర్ణోత్సవాల్లో భాగంగా కళాశాల వ్యవస్థాపకుడు కోటిరెడ్డి, శ్రీమతి కోటిరెడ్డి రామసుబ్బమ్మల విగ్రహాల ఆవిష్కరణ కోటిరెడ్డి వారసుల చేతుల మీదుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యుడు మాధవి, గౌరవ అతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి హాజరవుతారని తెలిపారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా జరిగే ఈ విగ్రహావిష్కరణ కోటిరెడ్డివారసులు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, జయభారత్‌రెడ్డి, సుచరిత, పద్మావతమ్మ, హర్షవర్ధన్‌రెడ్డిల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం కోటిరెడ్డివారసులు కళాశాలలో ప్రతిభ కలిగిన 18 మంది విద్యార్థులకు నగదు బహుమతిని అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా కళాశాల హాస్టల్‌లో ఉంటున్న 20మంది పేదవిద్యార్థులకు రాబోయే మూడు సంవత్సరాలు హాస్టల్‌లుకు అయ్యే ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

నేడు రామరాజుపల్లెలో రెవెన్యూ సదస్సు

కడప కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) భూ సమస్యల పరిష్కారం కోసం బుధవారం 11 వ తేదీన కడప మండలంలోని రామరాజు పల్లి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతోందని కడప తహశీల్దారు నారాయణ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సులు ఈనెల 6 వతేదీ నుంచి ప్రారంభమయ్యాయని 31 వరకు 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

హక్కుల సాధనకోసం ఏకతాటిపైకి రావాలి

కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకోసం దూదేకులంతా ఏకతాటిపైకి రావాల్సిన ఆవశ్యకత కలదని ఆంధ్రప్రదేశ్ నూర్‌బాష్ దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.చిన్నరాజా పిలుపునిచ్చారు. మంగళవారం ఎర్రముక్కపల్లెలోని నూర్‌బాష్ దూదేకుల భవనంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా సుంకేసుల బాషా, ప్రధాన కార్యదర్శిగా కుల్లాయప్ప, ట్రెజరర్‌గా మహమ్మద్ హుస్సేన్, గౌరవాధ్యక్షుడిగా బాబయ్య, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా వి. కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా చెన్నకేశవులు, ప్రచార కార్యదర్శిగా ఆర్. బాబు నియమితులయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారులు ఆయిల్‌మిల్లు ఓబులేసు, ఉపాధ్యక్షుడు కె.వి.హుస్సేన్, యూత్ విభాగ అధికార ప్రతినిధి కె. కమల్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్ల బాబు, నాగూర్, విద్యుత్ విభాగ ఏఈ రఫి తదితరులు పాల్గొన్నారు.

15న కాశిరెడ్డినాయన ఆరాధన మహోత్సవం

జమ్మలమడుగు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ప్రొద్దుటూరు రోడ్డులో బాలుర వసతి గృహం పక్కన ఉన్న భగవాన్ కాశినాయన దేవాలయంలో ఈనెల 15న ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పౌర్ణమి రోజు ఉదయం 6 గంటలకు గణపతి పూజ, 8 గంటలకు కాశిరెడ్డినాయన అభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మూర్తి హోమాలు, మహానివేదన, మంగళ హారతి, సాయంత్రం మహాహోమాలు జరుగుతాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు 108 బిందెసేవ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తాదులు 29వ ఆరాధన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ స్థలదాత బండి వెంకటయ్య, కమిటీవారు తెలిపారు.

బీసీలకు కులగణన నిర్వహించాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ సామాజిక వర్గానికి కుల గణన నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు సెక్రటరీ జనరల్ వెంకటకృష్ణయ్యయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం సగర సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కుల గణన నిర్వహించాలనేది బీసీల చిరకాల వాంఛ అన్నారు. బీసీ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర సలహాదారు నాగమల్ల శంకర్, జిల్లా కన్వీనర్ మాదాసు మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు దేవానంద్, ప్రతాప్, సుబ్బరాజు, రామకృష్ణ, వెంకటేష్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో న్యాయవిజ్ఞాన సదస్సు

జమ్మలమడుగు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో న్యాయవాదులు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం 1948 డిసెంబరు 10న మానవ హక్కుల ప్రకటన భారత స్వాతంత్ర్య సమరయోధులకు, తదితర మేధావులు కలిపి రూపొందించిన ప్రకటన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

బద్వేలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్, ఇద్దరి సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులంతా విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది పీవీఎన్.ప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాది శ్రీధర్ నాయుడుకు సంబంధించిన స్థలంలో నిర్మాణాలు చేపడుతుండగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కమిషనర్ వాటిని తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు.

ఆర్యవైశ్య పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఐదుగురికి రూ.25వేల స్కాలర్‌షిప్‌లను స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో పంపిణీ చేసినట్లు ఆవోపా అధ్యక్షుడు శేషయ్య తెలిపారు. మంగళవారం ఆవోపా అధ్యక్షుడు శేషయ్య మాట్లాడుతూ ఆరవేటి చిన్నసుబ్బరాయుడు వర్థంతి సందర్భంగా ఆయన కుమారుడు ఆరవేటి చిన్నసుబ్బారావు, కుటుంబ సభ్యులు నిర్మల సహకారంతో రూ.25వేలు చదువులో ముందుండి ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య కుటుంబ సభ్యులకు సాయం అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పత్తి సురేశ్, కోశాధికారి బి.సురేశ్, రాష్ట్ర ఈసీ మెంబరు బింగి సూర్యనారాయణ, మండల ఆర్యవైశ్య అధ్యక్షుడు సుంకు సురేశ్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

చాపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. ఒక్కో ఇంటికి రూ.2.77 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. లక్ష, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.27 వేలు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆయా గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వద్ద వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆదాయం లక్ష రూపాయలలోపు ఉండి కులం సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ల జిరాక్స్ కాపీలను తేవాలన్నారు.

'బస్‌స్టాండ్ ఇన్‌గేట్ అరగంట మాత్రమే వేశాం'

మైదుకూరు రూరల్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో శనివారం ఓ ప్రైవేటు కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రావడంతో బస్‌స్టాండ్ ఇన్‌గేట్ కేవలం అరగంట మాత్రమే మూసి వేసినట్లు మైదుకూరు డిపో మేనేజర్ శ్రీరామ్ కుమార్ తెలిపారు. ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎమ్మెల్యే వచ్చిన అరగంట మాత్రమే మూసివేశామన్నారు.కాగాఎమ్మెల్యే వచ్చి వెళ్లింది కేవలం అరగంట మాత్రమే,కానీ సినీయాక్టర్ అనసూయ ఎమ్మెల్యే వెళ్లిన గంట తరువాత వచ్చారు. సుమారు గంట పాటు ఆమె అక్కడే ఉన్నారు. తరువాత మరో అరగంట పాటు బారికేడ్లు అలానే ఉన్నాయి.

బీసీల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

బద్వేలుటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని త్యాగరాజుకాలనీలో నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వసంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రబడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్ల నిధులు మంజూరుచేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు వేతనాన్ని రూ.15వేల నుంచి రూ.25వేలకు పెంచారని, పాలక మండలిలో స్థానం కల్పించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణయ్య, గురుబ్రహ్మం, బాబు, మహేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని బేపారి వీధికి చెందిన హసీనా (29) అనే మహిళ అదృశ్యమైంది. పట్టణంలోని గంగమ్మ దేవాలయం వీధిలో టైలరింగ్‌షాపులో పనిచేస్తూ ఈనెల 9వ తేదీ రాత్రి 7 గంటలకు కుమారుడిని తీసుకుని వెళ్లి ఇంటికి రాలేదని, ఆమె తల్లి నూర్‌జహాన్ జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భయమేస్తోంది..!

పెచ్చులూడుతున్న మైదుకూరు ఆర్టీసీ బస్‌స్టాండ్ భవన స్లాబు ● ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు చేస్తున్న డిపో అధికారులు

మైదుకూరు రూరల్,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : కర్నూల్, అనంతపురం,చిత్తూరు,నెల్లూరు జిల్లాలకు కూడలిగా మైదుకూరు ఆర్టీసీ బస్‌స్టాండ్ పేరొందింది. మైదుకూరు బస్‌స్టాండ్‌లో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఎందుకంటే మైదుకూరు నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా బస్సు సౌకర్యం ఉంటు ందని ప్రజలు ఎక్కువగా నమ్ముతారు. అలాంటి బస్‌స్టాండ్‌లో సమస్యలు కోకొల్లలుగా ఉన్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బస్‌స్టాండ్ ఆవరణం నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బస్‌స్టాండ్‌లో స్లాబ్ చాలా వరకు పెచ్చులూడిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది . ఇదే విషయాన్ని పలుమార్లు ప్రయాణికులు ఆర్టీసీ డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సరిగ్గా రెండు నెలల క్రితం ఆకస్మిక తనిఖీ చేసి బస్‌స్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి ఒక నెల లోపల సమస్యలను వెంటనే పరిష్క రించాలని తెలిపారు. కానీ రెండు నెలలు గడుస్తున్న అధికారుల పనితీరులో చలనం లేదు. బస్‌స్టాండ్‌లో స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. ప్రయాణికులు ప్రమాదం కదా ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా డిపో మేనేజర్ శ్రీరాం కుమార్‌ను వివరణ అడుగగా అది ఇంజనీరింగ్ సెక్షన్ వాళ్లకు సంబంధి ంచినది. వారికి లెటర్ పెట్టామని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్ సెక్షన్ వాళ్లకు లెటర్ పెట్టి చేతులు దులుపుకొన్న అధికారుల తీరు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.ఆర్టీసీ యాజ మాన్యానికి ప్రయాణికులు ఇచ్చే డబ్బులు మాత్రం కావాలి,వారి ప్రాణాలంటే లెక్క పెట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మైదుకూరు బస్‌స్టాండ్ డిపో మేనేజర్‌కే సంబంధం లేదు అంటే ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని బస్‌స్టాండ్ ఆవరణలో స్లాబ్ కు మరమ్మతు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.





బస్‌స్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ (ఫైల్‌ఫొటో), పిల్లర్ వద్ద కడ్డీలు చిలుముపట్టి పెచ్చులూడిన దృశ్యం

మహిళలపై హింస మానవ హక్కుల ఉల్లంఘనే



నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రొద్దుటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో పెరిగిపోతున్న మహిళలపై హింస మానవ హక్కుల ఉల్లంఘనలే అని మహి ళా సంఘాల జేఏసీ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ను పురస్కరించుకుని మహిళా సంఘాల జేఏసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డు లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యాచారాలు, హింసకు మూలాలు తెలిసి కూడా వాటిపై దృష్టి పెట్టడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మి, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత , జమాతే ఇస్లాం మహిళా విభాగం కన్వీనర్ హసీనా,ఉషారాణి,సురేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి

మైలవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వలన యువత భవిష్యత్తు నాశనం అవుతుందని ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఎక్సైజ్ సీఐ సరితా రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అమృతహస్తం సేవా సంఘం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై ర్యాలీ నిర్వహించి అనంతరం పాఠశాలలో సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు నరసింహులు, సర్పంచ్ శ్రీదేవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ప్రసాద్, డాక్టర్ పృథ్వీరాజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో కోలాటం వేస్తున్న దృశ్యం

బద్వేలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో అయ్యప్పస్వామి పునః విగ్రహ ప్రతిష్ఠ, మహోత్సవంలో భాగంగా పురవీధులలో అయ్యప్పస్వామి శిలావిగ్రహాలతో గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామోత్సవం వెంట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా గురువారం అయ్యప్పస్వామి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రాగిమాను ప్రతాప్‌కుమార్, అయ్యప్ప స్వాముల భక్తబృందం తెలిపారు.

నెలాఖరులోపు వడ్డీ మినహాయింపుతో పన్నులు చెల్లించండి

బద్వేలు, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెలాఖరులోపు చెల్లించే పన్నులకు వడ్డీ మినహాయింపు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన పన్నులు వసూలు చేసే సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పన్నుల చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించి, సకాలంలో పన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రఘునాథరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ దంపతులకు గాయాలు

కొండాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లె సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ దంపతులకు గాయాలయ్యాయి. ఏటూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బింగి తిరుపాలు, తన భార్యతో కలిసి తాడిపత్రి నుంచి బైకులో ఏటూరుకు వెళుతుండగా మండలంలోని బ్రాహ్మణపల్లె సమీపంలో లారీ, బైకు ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. సంఘటనలో తిరుపాలు, అతని భార్యకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెవెన్యూ సదస్సులతోనే భూసమస్యలు పరిష్కారం: ఎమ్మెల్యే

రాజుపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారమౌతాయని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కూలూరు గ్రామసచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సర్వేలలో అవకతవకలు జరిగిన రైతులు భూసమస్యలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ హుస్సేన్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: గ్రామీణ ప్రాంతాల్లో భూసమస్యలు పరిష్కరించేందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నాయపల్లెలో జరిగిన రె వెన్యూ సద స్సుల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, సిద్దవరం మాజీ సర్పంచ్ సునీల్, టీడీపీ నాయకులు కొండా రామకిష్టారెడ్డి, రామసుబ్బారావు, సుబ్బరాయుడు, కల్లూరు వెంకటక్రిష్టారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'తప్పుదోవ పట్టించడం దారుణం'




మాట్లాడుతున్న అధికారులు

బద్వేలుటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వస్థలాల్లో ఆక్రమణలు చేపడితే నోటీసులు ఇచ్చి తొలగిస్తామనేది పొరపాటని న్యాయవాది బార్ అసోసియేషన్‌ను తప్పుదోవపట్టిస్తున్నారని ఇది దారుణమని మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి, గోపవరం తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 10 రోజుల నుంచి శివాలయం రోడ్డులో ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో ఆర్డీఓ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అక్కడకు వెళ్లి హెచ్చరించినప్పటికీ పనులు ఆపకుండా విధుల్లో ఉన్న సిబ్బందిపై అసభ్యపదజాలం ఉపయోగించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారన్నారు. బార్ అసోసియేషన్‌లో ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని తీర్మాణం చేపట్టడం చాలా దురదృష్టకరమన్నారు. 857/2బి సర్వేనెంబర్‌కు మాత్రమే ఎన్ఓసి ఇచ్చాం తప్ప, 855 సర్వేనెంబర్‌కు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని, రహదారులకు నోటీసులు ఎలా ఇస్తామని వారు పేర్కొన్నారు. ఈ సర్వేనెంబర్‌ను బార్‌అసోసియేషన్ పరిశీలించాలని కోరారు. అది ప్రభుత్వస్థలం కాబట్టే చర్యలు తీసుకున్నామని, ఉద్దేశపూర్వకంగా తొలగించలేదనేది న్యాయవాదులు గమనించాలన్నారు.

ప్రజలపై అధిక భారం మోపుతున్న ప్రభుత్వం

బద్వేలు, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పేరుతో ప్రజలపై అధిక భారాలు మోపుతోందని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.వి.రమణ పేర్కొన్నారు.మంగళవారం స్థానిక జేవీ.భవన్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగేష్, చిన్న, రాధాక్రిష్ణ, సుబ్బారెడ్డి తదితరులు అన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను పూలమాలతో ఘనంగా సన్మానించినట్లు బ్రహ్మంగారిమఠం పలుగురాళ్లపల్లె ప్రాజెక్టు వాటర్‌షెడ్డు చైర్మన్ నేలటూరి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన వాటర్‌షెడ్డు చైర్మన్ ఎన్నికల్లో తమకు సహకరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట కొండా రమణారెడ్డి, బసిరెడ్డి రమణారెడ్డి, మీసాల దుగ్గిరెడ్డి, బాలచెన్నయ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

మల్లికార్జునరెడ్డి, డిపో మేనేజర్



ముఖాముఖి

ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ప్రజల ప్రయాణ అవసరాలను తీర్చడంలో విశేష కృషి చేస్తోందని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ. మల్లికార్జున రెడ్డి అన్నారు. ఇది కేవలం ఒక రవాణా సంస్థగానే కాకుండా ప్రజల జీవనశైలిలో మార్పును తెస్తున్న ఒక శక్తిగా మారింది. ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణం సురక్షితం అని తెలిపారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రత్యేక కార్యా చరణతో విధులు నిర్వహిస్తామంటున్నడిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డితో ఆంధ్ర జ్యోతి ఇంటర్వ్యూ.

ప్రశ్న..: డిపోలో ఎన్ని బస్ సర్వీసులు ఉన్నాయి.

జవాబు..: 81 ఆర్టీసీ, 62 హైయర్ బస్సులు ఉన్నాయి. అందులో 2 ఇంద్ర, 18 సూపర్ లగ్జరీ, 7 అల్ట్రా డీలక్స్, 30 ఎక్స్‌ప్రెస్, 4 అల్ట్రా పల్లె వెలుగు, 77 పల్లె వెలుగు బస్ సర్వీసులు ప్రతిరోజు నడుస్తున్నాయి.

ప్రశ్న..: ఈ డిపో నుంచి ఏఏ ప్రాంతాలకు బస్ సర్వీసులు ఉన్నాయి.

జవాబు..: హైదరాబాద్, విజయవాడ, కర్నూల్, మంత్రాలయం, తిరుపతిలతో పాటు బెంగళూరుకు వయా కడప, వయా కదిరి మీదుగా బస్ సర్వీసులు ఉన్నాయి. అంతే కాకుండా చెన్నై, మదనపల్లి, ఒంగోలుకు జమ్మలమడుగు డిపో బస్సులు మా డిపో నుంచి పోతాయి.

ప్రశ్న..: మీ డిపో బస్ సర్వీసులలో ప్రతి రోజు ఎంత మంది ప్రయాణిస్తారు.

జవాబు..: నా పరిధిలోని డిపో బస్సులలో ప్రతి రోజు సుమారు 40 నుంచి 42 వేల మంది ప్రయాణిస్తారు.

ప్రశ్న..: బస్సుల నాణ్యత, నిర్వహణ కోసం ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు..: బస్సుల నాణ్యత నిర్వహణ కోసం 4 షెడ్యూల్ ప్రకారం వాహనాలను తనిఖీ చేస్తాం. షెడ్యూల్ 1 లో ప్రతి రోజు చెకింగ్, 2లో వారానికి ఒకసారి గ్రీసింగ్, షెడ్యూల్ 3లో 20 వేల కిలోమీటర్లకు ఒకసారి చెకింగ్, 4వ షెడ్యుల్‌లో 60 వేల కిలో మీటర్లకు చెకింగ్ చేస్తాం. 3,4 షెడ్యూల్ లలో వాహనాలు చెకింగ్ తర్వాత 20 కిలోమీటర్ల మేర రోడ్డు టెస్ట్ చేసిన తర్వాతానే లైన్లోకి పంపిస్తాం.

ప్రశ్న..: ప్రయాణికుల నుంచి సాధారణంగా వచ్చే ఫిర్యాదులు ఏవి, వాటి పరిష్కారానికి ఏ పద్ధతులను అనుసరిస్తారు.

జవాబు..: అధికంగా ఫిర్యాదులు పల్లె వెలుగు బస్సులు ఆపలేదని, ర్యాష్ డ్రైవింగ్, దురుసు ప్రవర్తన లాంటి వాటిపై అందుతాయి. ఆ సిబ్బందిని పిలిచి కౌన్సెలింగ్ ఇస్తాం.

ప్రశ్న..: డిజిటలైజేషన్ పద్ధతుల అమలు గురించి మీ అభిప్రాయం ఏమిటి.

జవాబు..: ఏపీఎస్ఆర్టీసీ లైవ్ ట్రాకింగ్ యాప్ ప్రజలు వినియోగించి ఆర్టీసీ బస్ రిజర్వేషన్, లైవ్ బస్ ట్రాకింగ్, కంప్లైంట్, ఎంక్వయిరీ తదితర సదుపాయాలను ఈ యాప్‌లో ఉండడంతో అధిక మంది ప్రజలు ఉపయోగిస్తున్నారు.

ప్రశ్న..: మీ డిపోలోని బస్ సర్వీసులలో ఎలక్ట్రికల్ బస్సులు ఉన్నాయా.

జవాబు..: ప్రస్తుతానికి ఎలక్ట్రికల్ బస్ సర్వీసులు లేవు. కడప నుంచి ప్రొద్దుటూరుకు సర్వీసుల కోసం నివేదిక పంపించి ఉన్నాం. దాని అనుగుణంగా సర్వీసులు తిప్పుతాం.


ప్రశ్న..: నూతన ఆర్టీసీ బస్టాండ్ వినియోగంలోకి ఎప్పుడు వస్తుంది.

జవాబు..: నూతన ఆర్టీసీ బస్టాండ్ పనులు పూర్తి అయ్యాయి. ముందు వైపు బస్సులు తిరగడానికి సిమెంట్ రోడ్డు పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తాం.

బడి చుట్టూ నీళ్లు..విద్యార్థులకు తప్పని తిప్పలు

అద్దెభవనంలో విద్యార్థులు





పి.అనంతపురం గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాల చుట్టూ గండికోట బ్యాక్‌వాటర్, అద్దెభవనంలో చదువుకుంటున్న విద్యార్థులు

కొండాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజి అనంతపురం గ్రామంలో ఉన్న ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల చుట్టూ నీళ్లు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పెంజి అనంతపురం గ్రామం గండికోటప్రాజెక్టు క్రింద ముంపునకు గురయింది. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉండటంతో బ్యాక్‌వాటర్ గ్రామాన్ని చుట్టుముట్టింది. దీంతో బ్యాక్‌వాటర్ పాఠశాల చుట్టూ చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చేసేదిలేక గ్రామంలో ఒక గదిని అద్దెకు తీసుకొని ఐదేళ్లుగా పాఠశాలను నడిపిస్తున్నారు. దీనివల్ల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని హెడ్మాస్టర్ బి.రాజు తెలిపారు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. కాగా పి.అనంతపురం గ్రామం గండికోట ప్రాజెక్టు క్రింద ముంపునకు గురికాగా, గత వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయి పరిహారం చెల్లించకపోవడంతో గ్రామంలో ప్రజలు బ్యాక్‌వాటర్ మధ్యనే నివాసం ఉంటున్నారు. నాలుగేళ్ల కిందట కేవలం 25 మందికి మాత్రమే పరిహారం ఇచ్చి మిగిలిన వారికి చెల్లించకపోవడంతో గ్రామస్థులు బ్యాక్‌వాటర్ మధ్యనే నివాసం ఉంటున్నారు.పాఠశాల దగ్గర ఎక్కువ నీళ్లు ఉండటంతో మూసేసి అద్దె గదిలో క్లాసులు నిర్వహిస్తున్నారు. పాఠశాల విషయమై ఎంఈవో రామయ్యను వివరణ కోరగా గ్రామంలో అందరూ వన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) క్రింద పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఒకవేళ ఆర్‌అండ్‌ఆర్ క్రింద దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అవకాశం ఉంటుందన్నారు. లేదా గ్రామంలో అందరూ మరొకచోట నివాసం ఏర్పరచుకొంటే కొత్త పాఠశాల భవనాల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని తెలిపారు.